## క్లుప్తంగా

### వికసించిన బ్రహ్మకమలం



మధురవాడ రెవెన్యూ లే అవుట్‌లో వికసించిన బ్రహ్మకమలం

మధురవాడ : అరుదుగా పూచే బ్రహ్మ కమలం మధురవాడ సమీపంలోని రెవెన్యూ లే అవుట్‌లోని ఓ ఇంట్లో వికసించింది. ఇక్కడ నివాసం ఉంటున్న కొలుకులూరి శ్రీనివాసరాజు, శ్రీదేవి ఇంట్లోని పెరట్లో ఇది వికసించి కనువిందు చేసింది. దీనిని చూడడానికి చుట్టుపక్కల వారు తరలి వచ్చారు.

### తాళ్లవలస పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీలో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీళ్లు ఆస్పత్రి రిజిస్టర్లు, ఫార్మసీని తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీసి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫార్మసీ నిర్వహణలో లోపాలు సవరించుకోవాలని సూచించినట్టు ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు తెలిపారు.

### సాంకేతికతకు అనుగుణంగా బోధన

భీమునిపట్నం: ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. డైట్‌లో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫైనల్స్ అనే అంశంపై శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక విధానాల ప్రకారం బోధనలో కూడా మార్పులు వస్తున్నాయని, వాటిని ఆకళింపు చేసుకుని బోధించాలని సూచించారు. శిక్షణ అందిస్తున్న అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటరాక్టివ్ విధానంలో బోధన విద్య విప్లవానికి నాంది అన్నారు. ఛాత్రోపాధ్యాయులు పాఠశాలల్లో ఇంటర్‌షిప్‌లో భాగంగా బోధించాలని సూచించారు.

### దోమల నియంత్రణకు చర్యలు



నూతిలో చేప పిల్లలు విడిచిపెడుతున్న కార్పొరేటర్ కొండబాబు, తదితరులు

కొమ్మాది: దోమలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. గాంబుష్య జాతి చేప పిల్లల ద్వారా దోమలను నివారించవచ్చని సూచించారు. మలేరియా నివారణ విభాగం ఎస్‌ఐ సూరిబాబుతో కలిసి చేపులుప్పాడలోని బావులు, చెరువులలో గాంబుష్య చేప పిల్లలను ఆయన విడిచిపెట్టారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

### పరిశోధన ఫలితాలు నమోదు చేసుకోవాలి

కొమ్మాది: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పూణేలో గల సీఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లేబరేటరీ సహకారంతో జాతీయ మేధో హక్కుల ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలు, పరిశ్రమల నుంచి 700 మంది ఈ ఉత్సవానికి హాజరయ్యారు. సీఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లేబొరేటరీ మేధో హక్కుల విభాగం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నితిన్ తివారీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యాలయాల్లోని ప్రయోగశాలల్లో జరిగే అధ్యయనాలు, వాటి ఫలితాలు పారిశ్రామిక ఉత్పత్తులుగా మారాలన్నారు. పరిశోధన ఫలితాలను విధిగా మేధో హక్కుల కింద నమోదు చేసుకోవాలని సూచించారు.



# 'జగనన్న సురక్ష'తో సామాన్యులకు మేలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అనంతవరంలో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

పద్మనాభం: 'జగనన్న సురక్ష'తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతవరం, పొట్నూరు గ్రామాల్లో శనివారం 'జగనన్న సురక్ష' గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు ఇబ్బంది కలగకుండా అన్ని సంక్షేమ పథకాలూ అందాలన్న సదుద్దేశంతో అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ తక్షణమే అందించేందుకు 'జగనన్న సురక్ష'కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఏదైనా ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే రెండు రోజుల్లోనే లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి చెందిన అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనే ప్రజల ఇళ్ల వద్దకు పథకాలు అందజేస్తున్నారన్నారు. భారత దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల చెంతకే అందజేస్తున్న బియ్యం పథకాన్ని పంజాబ్‌లో అమలు చేయడానికి అక్కడి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు వంద రోజుల పని దినాలు దాటినా పని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పొట్నూరు సర్పంచ్ బేపల భవానీ, ఎంపీటీసీ సభ్యురాలు తోనంగి దివ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, అవనాపు బంగారునాయుడు, బూసురోతు అప్పారావు, బేపల గురునాయుడు, తోనంగి అప్పలనాయుడు, బుగత సత్యనారాయణ, అముజూరి అప్పారావు, తాలాడ పద్మనాభం, మొకర అప్పలనాయుడు, ఎంపీడీవో ఎం.విజయ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువతికి తీవ్ర గాయాలు

పీఎం పాలెం: జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న యువతిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాలు మీద నుంచి లారీ వెళ్లిపోవడంతో నుజ్జునుజ్జయింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మారికవలస రాజీవ్ గృహకల్ప బ్లాకు నంబరు 32 జీఎఫ్ 6లో నివసిస్తున్న శీర షర్మిళ (19) ఇంటర్ వరకూ చదువుకుంది. ఆమె తండ్రి సింహాచలం పానీపూరీ వ్యాపారం చేస్తుంటాడు. శనివారం ఆమె చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా జాతీయ రహదారి దాటుతుండగా ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కింద పడిపోయిన షర్మిళ కాళ్ల పైనుంచి లారీ వెళ్లిపోయింది. క్షతగాత్రురాలిని వెంటనే ట్రాఫిక్ పోలీసులు సమీపంలోని గాయత్రి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు బాధితురాలిని తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు.

## పద్మనాభంలో భారీ వర్షం



పద్మనాభం జంక్షన్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పద్మనాభం జంక్షన్‌లో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. 5.30 గంటల నుంచి వర్షం ప్రారంభమై గంట సేపునకు పైగా కురిసింది. కృష్ణాపురం, కురపల్లి, పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది.

## ఆడపిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విజయలక్ష్మి

భీమునిపట్నం: ఆడపిల్లలు సమాజంలో సురక్షితంగా ఉండడానికి వారి తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు చెప్పాలని ఇక్కడి 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.విజయలక్ష్మి సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు కిడ్నాప్‌లకు గురికాకుండా, మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు చెప్పాలని కోరారు. విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ దీప, లోక్ అదాలత్ సభ్యులు పీఎస్ చంద్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎస్.సూరిబాబు, సీనియర్ న్యాయవాది ఎంవీ పార్వతీశం పాల్గొన్నారు.

## రవిరెడ్డి కుటుంబానికి పరామర్శ



రవిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి తండ్రి గుడిమెట్ల సత్తిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సాగర్‌నగర్‌లోని వారి ఇంటికి శనివారం వచ్చి రవిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

## అర్హులందరికీ నేరుగా ఆర్థిక ప్రయోజనాలు



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పీఎం పాలెం : రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నేరుగా ఆర్థిక ప్రయోజనాలు అందజేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే మెత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం పీఎం పాలెంలోని హౌసింగ్ బోర్డు కాలనీ 50వ నంబరు సచివాలయం పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారులకు సుమారు రూ.10.5 కోట్ల మేర పథకాలు అందజేశామన్నారు. ప్రభుత్వ ఇళ్ల స్థలాలు తమకు రాలేదని కొందరు ఫిర్యాదు చేయగా... అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీలో అండర్ డ్రైనేజీ సక్రమంగా పని చేయడం లేదని, పీఎం పాలెం ఆఖరు బస్టాపులో సిటీ సర్వీసుల రాకపోకలకు సంబంధించి టైమింగ్స్ బోర్డు లేదని, పందుల బెడద అధికంగా ఉందని, పారిశుధ్య పనులు నెలల తరబడి చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నగరాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పిల్లా సుజాత, జెడ్సీ కనక మహాలక్ష్మి, సీనియర్ నాయకుడు గాదె రోశిరెడ్డి, జీవీఎంసీ 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, పిల్లా సత్యనారాయణ, పోతిన ప్రసాద్, యర్రాజీ, సూరిబాబు, జామి.శివకుమార్, నరసింహారావు పాల్గొన్నారు.

## మెరైన్ సీఐగా సతీష్ కుమార్



కొమ్మాది: రుషికొండ మెరైన్ సీఐగా కె.సతీష్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐగా విధులు నిర్వహించారు. తీరప్రాంత భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటానని, ఎప్పటికప్పుడు తీరంలో పర్యవేక్షిస్తానని ఆయన తెలిపారు.

## మత్స్యకార గ్రామంలో ట్రైనీ ఐపీఎస్‌ల పర్యటన



మాట్లాడుతున్న మహిళా పోలీస్ అధికారి

తగరపువలస: విశాఖలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌ల బృందం శనివారం ఉదయం భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం గ్రామ పంచాయతీని సందర్శించింది. ఆఫీసర్స్ ట్రైనింగ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడారు. మత్స్యశాఖ విభాగానికి చెందిన అధికారులు డాక్టర్ మహేష్, కృష్ణమూర్తి అనుసంధానకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కోస్టల్ మెరైన్ డీఎస్పీ కాళిదాసు, సీఐ సతీష్, ఎస్ఐ మురళీకృష్ణ, భీమిలి సీఐ డి.రమేష్, మత్స్యశాఖ సచివాలయ అసిస్టెంట్ వి.మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాల పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలో శనివారం ఓటర్ల జాబితాల పరిశీలించారు. ఇక్కడి మెయిన్‌రోడ్డు, చట్టుపక్కల పరిధిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) బీపీ రావు, 184వ నంబరు బూత్‌కు సంబంధించిన ఏజెంట్ (బీఎల్‌ఏ) మైలిపల్లి లక్ష్మణరావు, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలు పరిశీలించారు.

## తుప్పల్లోకి దూసుకుపోయిన వాహనం



పనోరమా హిల్స్‌కు వెళ్లే రోడ్డు మలుపులో తుప్పల్లో వాహనం

పీఎం పాలెం : జీవీఎంసీ 8వ వార్డులో గల పనోరమ హిల్స్ – 2 రోడ్డు మలుపులో తుప్పల్లోకి దూసుకుపోయిన ఓ వాహనాన్ని శనివారం వాకింగ్‌కు వెళ్లిన వారు గుర్తించారు. ఈ వాహనం శుక్రవారం రాత్రి అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకుపోవడంతో కొంత మందికి బలమైన దెబ్బలు తగిలినట్టుగా తెలిసింది. అయితే ఇంత వరకూ ఈ వాహనానికి సంబంధించి స్థానిక పోలీసులకు సమాచారం అందలేదని పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపారు. సిబ్బందిని పంపించి పూర్తి వివరాలు సేకరిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో కొంతమంది అర్ధరాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారే వాహనంపై వచ్చి ప్రమాదానికి గురవడంతో ఆ వాహనాన్ని విడిచి పెట్టి జారుకుని ఉంటారని స్థానికులు అంటున్నారు.

### అభివృద్ధి పనులకు భూమిపూజ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నుంచి ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.5 లక్షలతో పనులు చేపట్టనున్నట్టు వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సాయిసుధ, శింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ, గాడు తాతినాయుడు, బమ్మిడి అప్పన్న, మాజీ సర్పంచ్ కె.జోగినాయుడు, తుపాకుల అప్పలరాజు, కనకల వెంకటరమణ, కనకల సన్యాసి పాల్గొన్నారు.

## సెమిస్టర్ – 2 పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ శనివారం జగనన్న విద్యా కానుకలో భాగంగా సెమిస్టర్ – 2 పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమిలి ఎంఈవో – 2 జయప్రద, ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. పుస్తకాలు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం సెమిస్టర్ – 2 పుస్తకాల పంపిణీ ఉత్సవం నిర్వహించారు. విద్యా కానుకల పంపిణీలో భాగంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభలో నెహ్రూ ఆమోదించారన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శ్రీవారి సన్నిధిలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున శ్రీవారికి సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం నగరానికి చెందిన జి.శ్రీనివాసరావు, వెంకట పద్మావతి దంపతుల సహకారంతో 500 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నమాచార్య కీర్తనలు, శ్రీవారి భక్తుల కోలాటాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యానికే యూబీఏ



వివిధ జిల్లాల ఫ్యాకల్టీ మెంబర్స్‌తో నిర్వాహకులు

మధురవాడ: సామాజిక అభివృద్ధిలో విద్యార్థులను భాగస్వాములను చేయడానికే ఉన్నత్ భారత్ అభియాన్ ఏర్పాటు చేసినట్టు ఆంధ్రా యూనివర్సిటీ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఛీకొట్టి పావని తెలిపారు. మధురవాడలోని గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రా యూనివర్సిటీ రీజినల్ కో ఆర్డినేట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ రీజినల్ వర్కుషాపు శనివారం నిర్వహించారు. యూబీఏ ఎయిమ్స్, ఆబ్జెక్ట్స్‌పై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంను పావని ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం ఆవశ్యకతను ఇటువంటి కార్యక్రమాలు ద్వారా తెలియజేయవచ్చని నోడల్ ఆఫీసర్ ఆచార్య జి.నాగరాజా అన్నారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి పలువురు ఫ్యాకల్టీ మెంబర్స్ మాట్లాడుతూ ఉన్నత్ భారత్ అభియాన్ విధులు, లక్ష్యాలు, ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నీటి వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. జీవీపీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ కోటేశ్వరరావు, డాక్టర్. కృష్ణ సుబ్బారావు, డాక్టర్ సీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అర్ధరాత్రిళ్లు తిరిగితే కఠిన చర్యలు



బీచ్‌రోడ్డులో తిరుగుతున్న యువకులను హెచ్చరిస్తున్న సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలి పరిధిలో అర్ధరాత్రి వేళల్లో ఎవరైనా తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ డి.రమేష్ హెచ్చరించారు. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో భీమిలి తీరంలోని లైట్ హౌస్, పార్కు, బీచ్‌రోడ్డులోని అనేక ప్రాంతాల్లో పలువురు యువకులు బర్త్‌డే పార్టీలు, ఫొటోషూట్‌లు చేసుకుంటూ కనిపించారు. వీరిలో కొందరు యువతులు కూడా ఉన్నారు. దీనిపై సీఐ రమేష్ తీవ్రంగా స్పందించి వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

అర్ధరాత్రి వేళల్లో ఇలా రోడ్లపై తిరగడం ఏమాత్రం సరైంది కాదని, అనుమతి కూడా లేదన్నారు. రాత్రి తొమ్మిది తర్వాత బీచ్‌రోడ్డులో ఎవరైనా అవసరం లేకుండా తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బీచ్‌లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, హెల్మెట్‌లు లేకుండా దిచక్ర వాహనాలపై తిరిగినా కేసులు నమోదు చేస్తామన్నారు.

## వ్యాధులపై అప్రమత్తత అవసరం



జీవీఎంసీ 4వ వార్డులో పర్యటిస్తున్న జెడ్సీ రాము

కొమ్మాది: వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ, కొత్తూరు, పాతూరు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. శానిటేషన్ సిబ్బంది వార్డులో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న క్రమంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటివి ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు ప్రజలకు ఏఎన్ఎమ్‌లు అందుబాటులో ఉండాలని, ఎక్కడ జ్వరాలు విజృంభిస్తున్నాయో పరిశీలించి చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల నిర్వహణ

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



రైతుబజార్ ఇరుకు రోడ్డులో దుకాణాలతో కిటకిటలాడుతున్న రహదారి

మధురవాడ : మధురవాడ రైతుబజార్ వద్ద చిల్లర, ఇతర దుకాణాలు మళ్లీ రోడ్డెక్కాయి. జాతీయ రహదారి నుంచి రైతు బజార్ వరకు సుమారు 50 మీటర్ల మేర 15 అడుగుల వెడల్పు ఉన్న సీసీ రోడ్డులో రెండు వైపులా కొందరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో వినియోగదారులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతుండేవారు. నిబంధనల ప్రకారం ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. కాని రెండు వైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో కనీసం ఏడెనిమిది అడుగుల స్థలం కూడా రాకపోకలకు మిగలడం లేదు. దుకాణాల రద్దీ వల్ల జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై కూడా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ఇటీవల వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రైతులు దీనిపై చర్యలు చేపట్టాలని స్పందనలో జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు పోలీసుల సహాయంతో దుకాణాలు తొలగించారు. వారం రోజుల వరకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేసి వదిలేశారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని వినియోగదారులు వాపోతున్నారు. అలాగే ప్రభుత్వ భూమిలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసి కొందరు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేస్తున్నారు.

లౌడ్ స్పీకర్లు పెట్టి మరీ రైతు బజారు లోపలికి వెళ్లే వినియోగదారులను పిలిచి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. దీనిపై ఈవో కృష్ణమూర్తిని వివరణ కోరగా రైతు బజార్‌కి 100 మీటర్ల లోపు ఇలా దుకాణాలు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీని వల్ల రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మరో సారి ఉన్నతాధికారులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

## చెత్త తరలించే ఆటోకు రూ.1.15 లక్షలతో మరమ్మతులు



ఆటోను సర్పంచ్ జమునకు అందిస్తున్న దివీస్ సిబ్బంది

తగరపువలస: దివీస్ లేబొరేటరీ గుడివాడ పంచాయతీకి చెందిన చెత్త తరలించే హైడ్రాలిక్ ఆటోకు మరమ్మతుల నిమిత్తం రూ.1.15 లక్షలు ఖర్చు చేసింది. ఈ ఆటోను శనివారం పంచాయతీ సర్పంచ్ చిల్ల జమునకు అందించింది. ఈ సందర్భంగా దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా చెత్త తరలింపునకు గతంలో తాము ఇచ్చిన ఆటోకు ఇప్పుడు తామే మరమ్మతులు చేయించి అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బుజ్జి, దాసరి అప్పలస్వామి, కొండపు ఈశ్వరరావు, చిల్ల హరిబాబు, సాడి అచ్చారావు, దివీస్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్. పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.